# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-10-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** ప్రకాశం జిల్లా నరసింగోలులో నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

**2.** ఆధునిక సాంకేతిక సాగు విధానాలతో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

**3.** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.

**4.** రాష్ట్రంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గాదేవి పూజ మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.

==========================

ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని నరసింగోలులో నిర్వహించిన 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 27.85 కోట్ల రూపాయలతో ముప్పాళ్ల వద్ద వంతెన నిర్మాణంతో పాటు, పాలేరు జలాశయం స్పిల్‌వే, ప్రధాన తూముల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం నర్సింగోలులో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేసి వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రో డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని మాట్లాడుతూ,

వాయిస్ 23 సెకన్లు

--------------------------

జనాభా గణన-2027 నిర్వహణపై అమరావతిలోని సచివాలయంలో రాష్ట్రస్థాయి ప్రధాన జనగణన అధికారుల సమావేశం కొనసాగుతోంది. జనాభా గణన రెండో దశలో డిజిటల్ సాంకేతికత వినియోగంపై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో జనగణన నిర్వహణకు అవసరమైన కార్యాచరణ వ్యూహం, సన్నద్ధతపై అధికారులు చర్చిస్తున్నారు. జనగణన కార్యకలాపాల సంచాలకులు జె. నివాస్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జనాభా గణన-2027 నిర్వహణపై అంశాలను అధికారులకు వివరించారు.

భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ జనగణన ప్రక్రియపై మార్గదర్శకాలను తెలియజేశారు.మొబైల్ యాప్, జనాభా గణన నిర్వహణ పర్యవేక్షణ వ్యవస్థ,గణన విభాగాల కేటాయింపు పోర్టల్‌పై అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు.

---------------------------

ఆధునిక సాంకేతిక, పర్యావరణహిత సాగు విధానాలతో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహిస్తున్న ఆక్వాఎక్స్ ఇండియా--2026 ఎక్స్‌పోను కేంద్రమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి ఆదాయం, విదేశీ మారకద్రవ్యాన్ని సమకూర్చడంలో ఆక్వా రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచ ఆక్వా మార్కెట్‌లో భారతదేశం మరింత బలోపేతం కావడంలో ఆక్వా రైతుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో వాణిజ్య అవకాశాలను పెంపొందించేందుకు ఇలాంటి ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడతాయని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరులోని ఏసీ నగర్‌లో 10 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆధునికీకరణ పనులకు మంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ..నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులను ప్రభుత్వ సహకారంతో 2028 చివరి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, అందుకే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.

---------------------------

క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్య సాధనలో యువత భాగస్వాములు కావాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ సూచించారు.ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ -జోష్ జాతీయ కార్యక్రమంలో భాగంగా, గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్త జోష్ కార్యక్రమాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్య సాధనలో యువత భాగస్వాములు కావాలని సూచించారు. క్షయ వ్యాధిపై అవగాహన పెంచే జోష్ బృందాల్లో ప్రభుత్వ అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ క్యాడెట్లు భాగస్వాములవుతారని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'ప్రజా సేవాతో దేశ సేవ' పేరుతో ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ సమైక్యతకు కోసం అమలు చేస్తుతున్న 'ఏక్ భారత్ -- శ్రేష్ఠ భారత్' గురించి ఈరోజు తెలుసుకుందాం.

భారతదేశంలో జాతీయ ఐక్యతను బలోపేతం చేస్తూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని చేపట్టింది.. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను జత చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల పరస్పర మార్పిడి, భాషల అభ్యసనం, పండుగలు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్ల పరిచయం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు, హర్యానాలోని విద్యార్థులు తెలుగు భాషను నేర్చుకోవడం, తమిళనాడులోని ప్రజలు లడఖ్ ప్రాంత సంస్కృతిని తెలుసుకోవడం వంటి కార్యక్రమాలు దేశ ప్రజల మధ్య అనుబంధాలను పెంపొందిస్తాయి. భిన్న భాషలు, భిన్న సంప్రదాయాలు ఉన్నప్పటికీ, భారతీయులందరిలో జాతీయ సమైక్యతా భావాన్ని బలోపేతం చేయడమే 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' కార్యక్రమ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక సందర్భంలో తెలియజేస్తూ..

వాయిస్ 25 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గాదేవి పూజ మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పోలీసు శాఖ అనుమతితో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మండపాలకు 3 కిలోవాట్లు, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మండపాలకు 5 కిలోవాట్ల చొప్పున ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దుర్గాదేవి ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున సహకారం అందించడం సంతోషంగా ఉందని లోకేశ్ పేర్కొన్నారు.

---------------------------

గుడ్డు చౌకైన, నాణ్యమైన పోషకాహార వనరు అని పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. పౌల్ట్రీ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఆధునికీకరించేందుకు పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29 ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు.ప్రజల పోషక భద్రతతో పాటు స్థానిక గుడ్ల వినియోగం, ఎగుమతులను పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

---------------------------

ఆధునిక సాంకేతికతతో రాష్ట్ర పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్పెయిన్‌లో జరుగుతున్న టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్–2026లో పాల్గొన్న ఆయన, ఏఐ, క్వాంటం టెక్నాలజీని పర్యాటక రంగంలో వినియోగిస్తున్నట్లు చెప్పారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పెట్టుబడులు పెరుగుతున్నాయని, రెండేళ్లలో సుమారు 20 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించామని తెలిపారు. స్పెయిన్ పర్యటనలో పరిశీలించిన అత్యుత్తమ విధానాలను ఆంధ్రప్రదేశ్ లో అమలు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

---------------------------

పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ రాంగోపాల్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురంలోని కొత్తవలసలో 'మన వీధి -- మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన కమిషనర్.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ చెత్త వాహనాలకు అందించాలని సూచించారు. ఇళ్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రెయిన్లలో చెత్త వేయకూడదని కోరారు.

=====================